ఆమె విశ్చుని సమర్థిస్తుందో లేక తిరస్కార భావంతో మాట్లాడుతుందో అర్థం కాలేదు.

" కృషీ" బయటి చీకటిలోకి చూస్తూ ఉదాసీనంగా అన్నాడు డాక్టర్ మహంతి.

"నీ తర్కాన్ని నేను కాదనలేను. నిజమే చంపకపోయినా చావటానికి అనుకూలమైన పరిస్థితుల్ని సృష్టించడమూ హత్య చేయడంలాంటిదే. కాని మీ గ్రాండ్‌పా మనస్తత్వమది. . . అది మనం మార్చలేనిది. కాబట్టే తన పంతంకోసం తన ఆరోగ్యాన్ని సైతం నాశనం చేసుకోగలడని నిరూపించుకున్నాడు మీ తాతయ్య. ఇలాంటి సమస్యకి పరిష్కారం చెప్పగలిగేది కాలమో లేక నీ ప్రయత్నమో నాకు తెలీదు కాని చెప్పాలనుకుంటున్నాను కృషి. అసలు ఇలా దాని గురించి చర్చించాల్సిన అవసరం ఏర్పడుతుందని ఇంతవరకూ ఊహించలేకపోయాను."

స్వగతంలా చెప్పుకుపోయాడు.

"మోహనగాంధీ మీ ఫ్యాక్టరీ కార్మికుడు మాత్రమే కాదు కార్మిక సంఘానికి నాయకుడు కూడా. చాలా నిజాయితీపరుడని పేరుండేది. ఒకనాడు మీ గ్రాండ్‌పాతో కార్మికుల డిమాండ్సుకి సంబంధించి మాట్లాడి విఫలం కావడంతో సమ్మెకి దిగాడు తన కార్మికుల అండతో. ఫ్యాక్టరీ లాకౌట్ అయింది. అయినా మీ గ్రాండ్‌పా చర్చలకి సిద్ధం కానన్నాడు. వారం రోజుల్లోగా పరిష్కరించకపోతే ఎనిమిదో రోజు ఆత్మాహుతి చేసుకుంటానని బెదిరించాడు మోహన్‌గాంధీ. ఉపాధ్యాయగారు కంగారుపడ్డారు. చర్చలకి ఆహ్వానించడానికి నిర్ణయించుకున్నారు.

"కాని ఆ ముందు రాత్రే టెంట్‌లో కూర్చున్న మోహన్‌గాంధీ హత్య చేయబడ్డాడు దారుణంగా. అయితే ఆ తర్వాత అది మోహన్‌గాంధీ ఆత్మహత్యగా నిర్ణయించ బడింది."

విస్మయంగా చూసింది కృషి "ఎలా"

"మీ గ్రాండ్‌పా ఖర్చుచేసిన డబ్బుతో అది సాధ్యమైంది కృషీ. లేకపోతే మీ తాతయ్య హంతకుడిగా నిలబడాల్సి వచ్చేది. కాబట్టే చాలా శ్రమపడి అది ఆత్మహత్యగా నిరూపించడం జరిగింది."

"అసలు హత్య చేయించిందెవరు?"

"చౌదరి"

కృషి నిశ్చేష్టంగా చూసింది.

"అవును కృషి. . . సమ్మెగాని చర్చగాని ఫలించడం యిష్టపడని చౌదరి మీ తాతయ్యని నేరస్థుడిగా నిలబెట్టి జైలుకి పంపాలనే ఉత్సాహముతో ఆ హత్య చేయించాడని తెలిసింది. అయితే ఆ నిజాన్ని నిరూపించడానికి ప్రయత్నించారు ఉపాధ్యాయ. . . లాభం లేకపోయింది. కారణం చౌదరివైపు వున్న దేవి అనబడే ఓ ఆడది."

కృషి విభ్రమంగా వింటూంటే దేవి అనబడే ఓ ఆడదాని గురించి ఆధ్యాత్మిక చర్చల నీడలో జరిగే అక్రమమైన దేవి కార్యకలాపాల గురించి చెబుతూ చౌదరి నేరస్థుడిగా చిక్కిన సమయంలో పోలీసు అధికారుల్ని తన శరీరంతో ఎలా ట్రాప్ చేసిందీ వివరించాడు.

"అంతే . . . డబ్బుతో మీ తాతయ్య తను చేయని హత్య నుంచి తనను కాపాడుకుంటే అదే డబ్బుతో దేవిద్వారా హంతకుడైన చౌదరి తనను తాను కాపాడుకున్నాడు."

నుదుటపట్టిన స్వేదాన్ని తుడుచుకుంటూ నిలబడిపోయింది కృషి చాలా సేపటిదాకా. మరోసారి తనకు ఇష్టంలేకుండానే చౌదరి అనబడే ఓ జుగుప్సాకరమైన పాత్రగురించి వినాల్సి వచ్చింది. ఇప్పుడు ఆమె ఆలోచిస్తున్నది అది కాదు. ఏ వ్య క్తయితే తన తండ్రి మరణానికి కారణమయ్యాడో ఆ వ్య క్తి అండతోనే విశ్వ తమపై దాడికి సిద్ధపడ్డాడు. . . నిజాన్ని వదిలి నీడవెంట పడుతున్నాడు. ఒక్కోసారి మేధస్సుతో ఆలోచించగల వ్యక్తులు సైతం మూర్ఖుల్లా ప్రవర్తించటానికి కారణం ఆలోచించే అవకాశమివ్వని పరిస్థితులైతే యిప్పుడు విశ్వని మంత్రించిన సర్పంలా మార్చేశాడు చౌదరి.

ఆధారాలులేని ఈ సత్యాన్ని విశ్వకి చెప్పినా అతడికి అర్థం కాదు. నిరూపించాలి సోదాహరణంగా. . . ఇప్పుడు సమస్య విశ్వని ఇంటినుంచి బయటకి తరమడం కాదు. అతడెవరన్నది తాతయ్యకి తెలియచెప్పడం కాదు. . . అతడ్నే అస్త్రంగా మార్చి చౌదరిపై చావు దెబ్బతీయడం.

అపరాత్రి కావస్తుంటే ఆలోచిస్తూ కారు నడుపుతున్న కృషి టేంక్‌బండ్ దగ్గర పోగయివున్న జనాన్ని చూసి కారాపింది.

"వయసులో వున్న పిల్ల. చావటానికి హుస్సేన్‌సాగర్‌లో దూకితే రక్షించారు. . ." చెబుతున్నాడెవరో.

రైలింగ్‌కి ఆనుకునివున్న సిమెంటు బెంచీపై ఇంకా స్పృహలోకి రాని అమ్మాయికి ఫస్ట్ ఎయిడ్ చేస్తున్నాడో వ్య క్తి.

ఓ వారగా కారుని పార్కు చేసిన కృషి ఏ శక్తో ప్రేరేపించినటటు అందరి మధ్యకి నడిచింది.

అంతే. . .

ఆ యువతిని చూస్తూ షాక్ తింది.

ఆమె ఎవరో కాదు జీవిత. . .కౌశిక్ చెల్లెలు.

ఆలోచనల తెరమాటున సమాధయిన గతంలా బ్రతుకు రంగస్థలంపై కొంత కాలం కదిలి కనుమరుగయిన కౌశిక్‌నే ఇంకా మరిచిపోలేకపోతుందే. అతడి ఆలోచనలకి అవశేషమై జీవిత ఎందుకిలా కనిపించింది.

కృషి ఆలస్యం చేయలేదు. తనే కారులో అపోలోకి తీసుకువెళ్ళింది.

స్పృహలోకి రావటానికి గంట వ్యవధి అవసరమైంది.

ముందు చూసింది కృషినే. . . జీవిత కళ్ళలో జివ్వున నీళ్ళు తిరిగాయి. . . అది తన ప్రయత్నం విఫలమైనందుకో లేక కృషికి యిలా దొరికిపోయినందుకో ఆమెకే తెలీదు. వెక్కి

ఆప్యాయంగా తల నిమిరింది కృషి. . .“పిచ్చిపిల్లా! మీ అన్నయ్యే అనుకుంటే అంత కంటే పిరికిదానివి నువ్వు-”

కౌశిక్ గురించి ఇప్పుడు మాట్లాడింది జీవితకి జీవితంపై ఆసక్తి కలిగించాలనే. . . గెలుపులాంటి అనుభూతికన్నా కొన్ని సమయాలలో ఓటమి గురించి మాట్లాడుకోవడం సంతృప్తిని కలిగిస్తుంది. ఇది అలాంటి సన్నివేశమే - “ఏమైంది జీవితా. . .మీ అన్నయ్య జ్ఞాపకలనుంచి మీ వాళ్ళింకా తేరుకొని వుండరే. . నువ్వు మరింత శోకాన్ని మిగిల్చి వెళ్ళిపోవాలని ఎందుకనుకున్నావ్”.

ఆమె జవాబు చెప్పలేదు. ఆ స్థితిలో వున్న ఏ ఆడపిల్లయినా అలాగే ప్రవర్తిస్తుంది...

“చెప్పమ్మా. . .” అక్కయ్యలా లాలించింది.

“నేను నీకు కావాల్సినదాన్నేగా. . . ”

మనసులో ఏ పొర కదిలిందో జీవిత అశ్రుశిక్త నయనాలతో చూస్తూ అంది. “నేను పెళ్ళి కాకుండనే తల్లి కాబోతున్నదాన్ని. అందుకే. . .”

ఆశ్చర్యపోలేదు కృషి. . . అలాంటిదేదో వుంటే తప్ప ఆ వయసులో వున్న ఏ ఆడపిల్లా యిలాంటి నిర్ణయం తీసుకోదు. . .

“ఎవరా అబ్బాయి” నిశ్చలంగా అడిగింది కృషి - “నీకు న్యాయం చేస్తాననే హామీ ఇవ్వడం లేదు జీవితా. . . చేయటానికి ప్రయత్నిస్తానంటున్నాను చెప్పు.”

కృషి స్థాయిగల ఆడపిల్ల చెప్పే ప్రతి పదమూ ఓ హామీ కాగలదనుకుందో - ఆ క్షణంలో కృషిని మించిన ఆత్మీయురాలు మరొకరు లేరనిపించిందో చెప్పింది జీవిత “రాజేష్ - రామనాథ్ చౌదరిగారి అబ్బాయి”

ఎక్కడో ఓ పిడుగు పడిన చప్పుడు. . . ఎన్నో ప్రశ్నలకి ఒక్క జవాబులా మళ్ళీ రామనాథ చౌదరి పేరునే వినాల్సి వచ్చిందేమిటి - శాఖోపశాఖలుగా విస్తరించిపోతున్న చౌదరి దమననీతికి రాజేష్ కూడా వారసుడేనా. . .బ్రతుకు పుస్తకాన తల దూర్చి రేపటి పరీక్ష కోసం చదువుకొనే ఓ మధ్య తరగతి అమ్మాయి యిక్కడా పరీక్షలో విఫలమైనందుకు తనను తాను అంతం చేసుకోవాలనుకుంటూంది.

రాజేష్‌కీ, జీవితకీ ఎలా పరిచయం అన్నది కాదు యిక్కడ సమస్య. “రాజేష్ నిన్ను కాదన్నాడా” నెమ్మదిగా అడిగింది కృషి.

“వాళ్ళ నాన్నకి భయపడి నేనేం చెయ్యలేనంటూ మొహం చాటేశాడు.”

అందులో నిజానిజాల గురించి ఆలోచించలేదు కృషి.

అదే రాత్రి ఆమెను ఇంటిదగ్గర డ్రాప్ చేస్తూ అంది కృషి “ప్రపంచంలో ప్రతి సమస్యకీ చావే పరిష్కారమైతే ఈ ప్రపంచంలో ఏ ఒక్కరూ మిగిలేవారు కాదు జీవితా - జీవితమంటే వైఫల్యం కాదు. . . . విఫలం కావడమూ జీవితంలో ఓ భాగమని నువ్వు అర్థం చేసుకోవాలి. . .

జీవితం కాబట్టి - ధైర్యంగా వుండు . . .

## The World is A Comedy To Those That Think, A Tragedy To Those That Feel"

మరో బాధ్యతని కృషి నెత్తిన వేసుకుంది. . .

0 0 0

ఉదయం ఆరున్నర కావస్తుండగా బాత్‌రూములో అడుగుపెట్టిన కృషి బడలికగా టబ్‌లోకి చేరి వాల్వ్‌ని ఓపెన్ చేసింది. గోరు వెచ్చగా శరీరాన్ని తడుపుతున్న నీళ్ళు ఆమెకు అదోలాంటి ప్రశాంతతని అందిస్తుంటే స్టీరియోలో మంద్రంగా వినిపిస్తున్న మైకేల్ జాక్సన్ 'బ్లాక్ అండ్ వైట్' మనసుని వివశత్వానికి గురి చేస్తుంది.

గుండె కెందుకీ సంకోచ వ్యాకోచాలు. . . బ్రతుకుని కోల్పోయిందేమైనా కాని ఆశల్ని సమాధి చేసుకుని ఎక్కడో సుదూరంగా బ్రతికేస్తూ యిక్కడ కొచ్చిన తనకీ అనుభవాలేమిటి... ధృవాల దిగంతాల్లో కల్లోల రాగాలనాలపించిన వర్తమానానికి అతీతంగా శరశయ్యలాంటి భవిష్యత్తులో శేషంగా మిగలాలి అనుకుంటే కార్చిచ్చు వర్షంలో తడిసిపోయి ఇంత కలవర పడుతుందేం. . . అసలిది కలవరమా . . .కోరని కలల్ని వరించడమా . . . ఎదుకు తనింతగా స్పందిస్తూంది. . . కూతకొచ్చిన కోయిలే అయితే తనకి కొరత లేదని తెలుసే - అయినా ఉదయ సంధ్యని కాదని గ్రీష్మంలో నడవాలని తను కోరుకుంటూంది అంటే ఎక్కడ తనలో లోపం - పూతకొచ్చిన మావిలా కదలాలనుకుంటూ చచ్చిపోయిన పచ్చదనంతో కాళ్ళని కదలించలేక కలత చెందుతుందెందుకని. . . ఇంత తెలివైన తను విశ్వని ఓడించలేక పోవటానికి కారణం గెలవలేకనా . . . లేక గెలుపుకంటే ఓటమిలోనే తను ఆనందాన్ని పొందుతూందా. . . పూర్తిగా అతడి గురించి ఆలోచించటానికి వెనుకాడుతున్నది కౌశిక్ జ్ఞాపకాలుమాసిపోకనా, లేక విశ్వ పై నిజంగానే మనసు లేకనా. . .

సమూహం మధ్య ఏకాంతం లాంటి ఈ బ్రతుక్కి అర్ధమేమిటి. . . అర్ధనిమీలితాలై ఆమె కనురెప్పల్ని పాయలుగా కదిలిన కుంతలాలు కప్పి విచిత్రంగా గిలిగింతలు పెడుతుంటే పక్కకి ఒరిగింది ఆందోళనకి ఆలాపనలా గుండెలు ఎగిసి పడుతుంటే మంత్ర ముగ్ధలా పైకి లేచింది.

తను నగ్నంగా వున్నాననన్న విషయం మరచినట్టు కృషి అలాగే నడిచింది.

ఎదురుగా నిలువుటద్దం. . .

ఖజురహో శిల్పంలాంటి పొంకం.... నిసర్గ సుందర జానపద గీతాన్ని తలపించే హసిస్తున్న వసంత గానంలాంటి వర్చస్సు - స్వాప్నిక యుగళ గీతాల నేత్రాలు - మొలకల కనుకొలకుల్లో తళుక్కుమనే రాగరేఖలు - మౌనాన్ని వేడిగా నిట్టూర్చే వక్ష ద్వయం - ధూళి రేగిన సంధ్య కాంతిలాంటి శరీరఛాయ.

అదిగో అప్పుడు ఆ ధ్యానంలోనే చూసింది ఎడమ స్థనానికి ఎగువగా నల్లని పుట్టమచ్చ.

మరల్చింది. . . ఎడమ తొడపై మరొక పుట్టుమచ్చ - బిడియంతో ఒదిగిపోయింది. . . అదికాదు ఆమెను మరింత ఆందోళన పరిచింది. ఇంతకాలం తను గమనించలేదు నాభికి నాలుగు అంగుళాల దిగువునవున్న నల్లని పుట్టుమచ్చని.. . అది కూడా అతడు-

నెత్తుటి కొలనులో అతడి చూపుల నాళికని ముంచితే నాదం నినాదమై బిందువు సింధువై సృష్టి ద్వారా మణికవాటం తెరుచుకుని మనోసాగర స్వర మండలం గట్టుల్ని తెంచుకుని-

ఏమిటి. . . ఎందుకు తనిలా ఆలోచిస్తూంది.

ఒంటరితనం యింత భయానకంగా వుంటుందా. . .

మనసుని నిగ్రహించుకొని డ్రెస్ చేసుకుని మరో పది నిమిషాలలో గదిదాటి బయటికి వచ్చింది.

ముందు కనిపించింది విశ్శు - అతడే కనిపించాడో లేక తనే ముందతడ్ని చూసిందో ఆమెకే తెలీదు. కాని డైనింగ్ టేబుల్ దగ్గర గ్రాండ్‌పా కూడా వున్నాడు అప్పడికే.

అదికాదు. స్నేహితుల్లా చర్చించుకుంటున్నారు.

"గుడ్‌మానింగ్ గ్రాండ్‌పా" అంది తప్ప విశ్శుని విష్ చేయలేదు.

అరక్షణం విరామం తర్వాత విశ్శు ఇందాక ఆపిన చర్చని కొనసాగిస్తూ చెప్పుకుపోతున్నాడు. "అంచేత మీ కుడిచేతి బొటన వ్రేలిమీద పుట్టుమచ్చ మీ స్థాయికి కారణమన్న నిజాన్ని మీరు అంగీకరించాలి- ఈ లెక్కన మీకు రైట్ థై మీద కూడా మరో పుట్టుమచ్చ వుండి వుండాలి. . . అలాగే గుండెపై. . . "

ఆ తర్వాత కృషికి అతడి మాటలు వినిపించలేదు. అతడు చెబుతున్నది తనని ఉద్దేశించే అనిపిస్తుంటే ఇక భరించలేనట్టు లేవబోయింది.

"ఉండు బేబీ. . ." మృదువుగా వారించాడు ఉపాధ్యాయ.

"విశ్వనాథ్ మేనేజ్‌మెంట్ సైన్స్‌లోనే కాదు పుట్టుమచ్చల శాస్త్రం గురించీ క్షుణ్ణంగా తెలిసినవాడు.

అయినా ఆమె వెళ్ళిపోవాలనుకుంది. వెళ్ళిపోయేదే. . ."అదే మాదిరిగా గొప్ప అదృష్టాన్ని అందిస్తుంది ఊర్ధ్వోష్టంపై వున్న పుట్టుమచ్చ కూడా. . ."